


## షటిల్‌లో అక్షయ్ కుమార్‌కు ప్రథమ బహుమతి


# వరంగల్ వాయిస్

www.warangalvoice.net

Evening Daily

వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 90 మంగళవారం | 03 అక్టోబర్ 2023 | పేజీలు : 08 | వెల రూ. 5




- వేగంగా విస్తరిస్తున్న గుర్రపు డెక్క
- పర్సంటేజీల కోసమే ఫ్లోటింగ్ ట్రాష్ కలెక్టర్ కొనుగోలు
- దిష్టిబొమ్మగా మారిన ఎఫ్‌టీసీ
- రూ.2 కోట్ల ప్రజా ధనం వృథా
- బల్దియా తీరుపై జనం ఆగ్రహం

# రూ. 100 కోట్లు ఏమాయే..?



## అటకెక్కిన చెరువుల సుందరీకరణ

బల్దియా పరిధిలోని చెరువుల సుందరీకరణ, అభివృద్ధి అటకెక్కింది. పాలకుల నిర్లక్ష్యం చెరువులకు శాపంగా మారింది. నగరంలోని భద్రకాళి చెరువు, వడ్డెపల్లి చెరువు, కాజీపేట బంధం చెరువు, ఉర్సు రంగ సముద్రం చెరువులను స్మార్ట్ సిటీ పథకంలో చేర్చి అభివృద్ధి చేయాలన్న లక్ష్యం నీరుగారుతోంది. స్మార్ట్ సిటీ పథకం కింద సుమారు రూ.100కోట్లు కేటాయించినా చెరువుల సుందరీకరణకు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. వేగంగా విస్తరిస్తున్న గుర్రపు డెక్కతో అసలు చెరువుల మనుగడే ప్రశ్నార్థకంగా మారగా, రోజు రోజుకూ వాటిలో పేరుకుపోతున్న వ్యర్థాల తొలగింపు ప్రధాన సమస్యగా మారుతోంది. కలెక్టర్ ఆధ్వర్యంలో పనిచేయాల్సిన చెరువుల పరిరక్షణ కమిటీ చేతులెత్తేయగా, పట్టణ ప్రగతిలో భాగంగా రూ.2కోట్లతో ఫ్లోటింగ్ ట్రాష్ కలెక్టర్ ను కొనుగోలు చేసిన బల్దియా దానిని భద్రకాళి చెరువులో దిష్టిబొమ్మగా మార్చడంపై జనం భగ్గుమంటున్నారు. - వరంగల్ వాయిస్, వరంగల్

వివరాలు 2లో..

## ఎన్నికల నియమావళిని పక్కాగా అమలు చేయాలి

### హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్







## కేటీఆర్ పర్యటనకు భారీ బందోబస్తు

### పోలీస్ ఉన్నతాధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో సీపీ పరిశీలన

# రూ.100 కోట్లు ఏమాయే..?



- అటకెక్కిన చెరువుల సుందరీకరణ
- వేగంగా విస్తరిస్తున్న గుర్రపు డెక్క
- పర్సంటేజీల కోసమే ఫ్లోటింగ్ ట్రాష్ కలెక్టర్ కొనుగోలు
- దిష్టిబొమ్మగా మారిన ఎఫ్ టీసీ
- రూ.2కోట్ల ప్రజా ధనం వృథా
- బల్దియా తీరుపై జనం ఆగ్రహం

**వరంగల్ వాయిస్, వరంగల్ :** గుర్రపు డెక్క.. ఇది నీటిలో పెరిగే కలుపు మొక్క. ఇటీవలి కాలంలో ఈ కలుపు మొక్క వేగంగా విస్తరిస్తూ నగరంలోని పురాతన చెరువులు, కాలువల నామరూపాలు లేకుండా చేస్తోంది. దీంతో రోజు రోజుకూ నీటి నిలువ సామర్థ్యం తగ్గిపోతోంది. వాటిలో పేరుకుపోతున్న వ్యర్థాల తొలగింపు కూడా ప్రధాన సమస్యగా మారుతోంది. ఎండల తీవ్రత కారణంగా చెరువులు, కాలువల్లోని నీరు వేడెక్కి దుర్గంధం వెదజల్లుతోంది. వైరస్ మాదిరిగా ఈ మొక్క అత్యంత వేగంగా పెరిగిపోతుంది. తక్కువ రోజుల్లోనే వందల మీటర్లు పాతుతోంది. మొక్క ఆకు బాగా వెడల్పుగా, దళసరిగా ఉండటం, మొక్క అడుగు భాగం ఉబ్బెత్తుగా ఉండటంతో ఒక్క చిన్న మొక్క ఎక్కువ స్థలాన్ని ఆక్రమిస్తుంది. నీటిలో తెలియాడుతూ మొత్తం కాల్వలను, భూములను ఆక్రమించి అతి తక్కువ కాలంలో ఎక్కువగా విస్తరించే మొక్క జాతుల్లో గుర్రపు డెక్క ప్రసిద్ధిమైంది. ఇదేదో ఉపయోగకరమైన మొక్క అనుకుంటే పొరబడినట్లే. ఎందుకు పనికి రాని, రైతును సర్వనాశనం చేసే మొక్క ఇది.

## జీవ వైవిధ్యానికి నష్టం..

పెరుగుదల ఎంత ఎక్కువగా ఉంటుందో, అదే స్థాయిలో ఈమొక్క నష్టాలు తెచ్చిపెడుతుంది. దక్షిణ అమెరికా ప్రాంతానికి చెందిన ఈ మొక్కను 1896వ సంవత్సరంలో రాయల్ బోటానికల్ గార్డెన్ కలకత్తాకు అలంకార మొక్కగా దిగుమతి చేయడం జరిగింది. ఆ తరువాత ఈ మొక్క దేశం అంతటా విస్తరించింది. ఈ కలుపు మొక్కతో చేపల వేట కష్టంగా మారడంతోపాటు కాలువల్లో పడవల రాకపోకలకు కలుగుతోంది. నీటి నష్టం, దోమలు, ఇతర క్రిమి కీటకాలు వృద్ధి చెందడం వలన జబ్బుల వ్యాప్తి, జీవ వైవిధ్యానికి నష్టం, నీటి నాణ్యత దెబ్బతింటోంది. ఈ కలుపు మొక్క నీటిపైన తేలియాడుతూ నీటిలోని పోషకాలను పీల్చుకుంటుంది. వేరు భాగంలో ఉండే తేలికపాటి కణజాలం వలన మొక్కకు నీటి పైన తేలియాడే గుణం ఉంది. మొదటగా చెరువుల్లో, కాలువల్లో ఒక్కో మొక్కగా కనిపిస్తుంది. కానీ శాఖీయోత్పత్తి ద్వారా వేగంగా వ్యాప్తి చెంది పూర్తిగా చెరువులు, కాలువల్లోని నీరు కనిపించకుండా నిండిపోతాయి. శాఖీయోత్పత్తి ద్వారా మాత్రమే కాకుండా ఈ మొక్క ఉత్పత్తి చేసిన విత్తనాలు చెరువులో నీరు తక్కువగా ఉండే కాలంలో నిద్రావస్థలో ఉండి నీరు చేరగానే మొలకెత్తి చెరువు నిండా మళ్ళీ విస్తరిస్తోంది.

## పచ్చదనం పరిచినట్లు..

నీటితో కనిపించాల్సిన నగరంలోని చెరువులు పచ్చదనం పరిచినట్లుగా గుర్రపుడెక్కతో దర్శనమిస్తున్నాయి. కాకతీయ రాజులు నిర్మించిన భద్రకాళి చెరువును గ్రేటర్ ప్రజల అవసరాలకోసం వేసవి జలాశయంగా మార్చినప్పటికీ చెరువు మొత్తం విస్తరించిన గుర్రపు డెక్క ఇక్కడి నీటిని కలుషితం చేస్తోంది. ఇదే పరిస్థితి నగరంలోని ఇతర చెరువుల్లోనూ నెలకొంది. హనుమకొండ వడ్డేపల్లి చెరువు, దేశాయిపేట చిన్న వడ్డేపల్లి చెరువు, ఉర్సు రంగ సముద్రం, కాజీపేట బంధం చెరువు, గొర్రెకుంట కట్టమల్లన్న చెరువు, మామునూరు చెరువు, న్యూ శాయంపేట కోటి చెరువు ఇలా ఏ చెరువు అందం చూసినా గుర్రపె డెక్కల మయంగా మారింది.

## ప్రజా ధనం వృథా..

చెరువుల్లో పేరుకుపోయిన చెత్త, దట్టంగా మొలుస్తున్న గుర్రపు డెక్కను తొలిగించే సమయంలో పారిశుద్ధ్య కార్మికులు ప్రమాదాలకు గురి కావడంతో స్పందించిన గ్రేటర్ పాలకవర్గం పట్టణ ప్రగతిలో భాగంగా రూ.2కోట్ల వ్యయంతో అధునాతన సాంకేతికతో రూపుదిద్దుకున్న ఫ్లోటింగ్ ట్రాష్ కలెక్టర్ (ఎఫ్ టీసీ)ని కొనుగోలు చేశారు. ఇది చెరువుల్లో 12 మీటర్ల లోతుకు వెళ్లి పేరుకుపోయిన వ్యర్థాలను వెలికితీస్తుంది. చెరువులు, కాల్వల్లో సేకరించిన వ్యర్థాలను ఒడ్డున పడేస్తుంది. అదే విధంగా నీటిపై తేలే చెత్త, గుర్రపు డెక్కను వేళ్ళతో సహా పీకేస్తుంది. అయితే గుర్రపు డెక్క తొలగింపు మూన్నాళ్ల ముచ్చటగానే మారింది. ఎఫ్ టీసీ మొరాయించడంతో దానిని భద్రకాళి చెరువులో ఓ మూలన దిష్టి బొమ్మగా ఏర్పాటు చేశారు. దీన్ని బాగు చేసింది లేదు..తిరిగి వినియోగించింది లేదు. దీంతో రూ.2కోట్ల ప్రజా ధనం దుర్వినియోగం అయింది.

## పట్టించుకోని బల్దియా..

అధికారులు గుర్రపు డెక్క తొలగింపుపై మీన మేషాలు లెక్కిస్తున్నారు. వాస్తవంగా ప్రతీ ఏడాది వేసవి కాలంలో నగరంలోని అన్ని చెరువుల్లో గుర్రపు డెక్కను పూర్తిగా తొలగించాల్సి ఉంటుంది. కాని ఆ దిశగా చర్చలు చేపట్టడంలేదు. రూ.2కోట్లతో కొనుగోలు చేసిన ఫ్లోటింగ్ ట్రాష్ కలెక్టర్ ను గత సంవత్సర కాలంగా నిరుపయోగంగా ఉంచడంపై నగర ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కేవలం పర్సంటేజీల కోసమే ఎఫ్ టీసీని కొనుగోలు చేశారా అంటూ ప్రశ్నిస్తున్నారు. నగర పరిధిలోని చెరువులను రక్షించాల్సిన బాధ్యత బల్దియా పాలక వర్గంపై ఉన్నప్పటికీ వారు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై మండి పడుచున్నారు.

## కనిపించని సుందరీకరణ..

బల్దియా పరిధిలోని చెరువులు, కుంటల సుందరీకరణ, అభివృద్ధి అటకెక్కింది. పాలకుల నిర్లక్ష్యం చెరువులకు శాపంగా మారింది. నగరంలోని భద్రకాళి చెరువు, వడ్డెపల్లి చెరువు, కాజీపేట బంధం చెరువు, ఉర్సు రంగ సముద్రం చెరువులను స్మార్ట్ సిటీ పథకంలో చేర్చి అభివృద్ధి చేయాలన్న లక్ష్యం నీరుగారుతోంది. స్మార్ట్ సిటీ పథకం కింద సుమారు రూ.100కోట్లు కేటాయించినా చెరువుల సుందరీకరణకు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వేగంగా విస్తరిస్తున్న నగరంతోపాటు గుర్రపు డెక్కకూడా అంతే వేగంగా చెరువులను అక్రమించడంతో వాటి మనుగడే ప్రశ్నార్థకంగా మారుతోంది. రోజు రోజుకూ వాటిలో పేరుకుపోతున్న వ్యర్థాలతో పర్యావరణానికి ప్రమాదం పొంచిఉంది. సుధీర్ఘ కాలంగా చెరువులు, కుంటల్లో పేరుకు పోయిన వ్యర్థాల తొలగింపు బల్దియా అధికారులకు ప్రధాన సమస్యగా మారుతోంది. కలెక్టర్ ఆధ్వర్యంలో పనిచేయాల్సిన చెరువుల పరిరక్షణ కమిటీతోపాటు బల్దియా పాలకవర్గం స్పందించి నగరంలో కనిపించకుండా పోతున్న చెరువులను పరిరక్షించాలని గ్రేటర్ ప్రజలు కోరుతున్నారు. నీరు ఉంటేనే జీవరాసుల మనుగడకు ఎలాంటి ప్రమాదం ఉండదంటున్నారు. ఈ విషయంలో వరంగల్ మహా నగర పాలక సంస్థ పాలకవర్గం, అధికారులు దృష్టి సారించాలని నగర ప్రజలు కోరుతున్నారు.



# ఎమ్మెల్యే అరూరికి నిరసన సెగ

**వరంగల్ వాయిస్, వర్ధన్నపేట :** వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ కు నిరసన సెగ తగిలింది. దళితబంధు, గృహలక్ష్మి పథకాలతోపాటు ఇతర సంక్షేమ పథకాల్లో కొంతమంది లీడర్లకే లబ్ది చేకూరుస్తున్నారని ఆరోపిస్తూ మంగళవారం వర్ధన్నపేట మండలంలోని దమ్మన్నపేట గ్రామస్థులు నిలదీశారు. గ్రామంలో పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సలు చేసేందుకు విచ్చేసిన ఎమ్మెల్యేపై ప్రజలు తిరగబడ్డారు. ఎమ్మెల్యే గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. దీంతో బీఆర్ ఎస్ నేతలు గ్రామస్థులపై తోపులాటకు దిగడంతో కొంత ఉద్రిక్తత నెలకొంది. రంగ ప్రవేశం చేసిన పోలీసులు స్థానికుల్ని చెల్లాచెదురు చేశారు. పోలీసుల రక్షణతో ప్రచార రథంపైకి చేరుకున్న అరూరి రమేష్ గ్రామస్థులను శాంతింపజేసే ప్రయత్నం చేసినప్పటికీ నిరసనలు చల్లారలేదు. దీంతో గ్రామంలో ఎమ్మెల్యే తన పర్యటనను త్వరగా ముగించుకున్నారు.

# ఎన్నికల నియమావళిని పక్కాగా అమలు చేయాలి

**హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్**




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఎన్నికల ప్రవర్తన నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ సిక్త పట్నాయక్ అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎంసీసీ మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అమలుపరిచే ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్, సర్వైవల్ స్టాటిస్టికల్ టీమ్, వీడియో సర్వైవల్ టీమ్, వీడియో వీవింగ్ టీములకు సంబంధించిన అసిస్టెంట్ ఎక్స్పెండీచర్ పరిశీలకులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ అధికారులు ఎన్నికలను స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించడానికి కృషి చేయాలన్నారు. అందుకు తగిన విధంగా శిక్షణ పొందాలన్నారు. ఎన్నికల మార్గదర్శకాలను సంపూర్ణంగా అధ్యయనం చేయాలన్నారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన క్షణం నుంచే ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోనికి వస్తుందన్నారు. అందుకు గాను ఎన్నికల నిబంధనలను పాటించే విధానంపై ఈరోజు నుండే ప్రత్యేకంగా శ్రద్ధ పెట్టాలన్నారు. అందుకు మీరు నియోజకవర్గం, మండల స్థాయిలలో సమావేశాలు ఏర్పాటు చేసుకోవాలని, ఎన్నికల నిబంధనలు, సమాచారం మీ వద్ద ఉండాలని, క్షేత్రస్థాయిలో పరిశీలన పెంచుకోవాలని, ఎలక్షన్ విధుల పట్ల సీరియస్ ఎఫర్ట్ పెట్టాలని, మీతో నియమింపబడిన సహ అధికారులతో మంచి అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ఎన్నికల రిపోర్టులు సకాలంలో సమర్పించేలా పనితీరు మెరుగు పర్చుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాలలో విద్యుత్, టాయిలెట్లు, తాగు నీరు, ఫర్నీచర్, వసతులు పూర్తి అయ్యేలా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్నికల విధుల్లో ఉండే సిబ్బంది కమిషన్ ఆధీనంలో పని చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. నోటిఫికేషన్ వెలువడిన వెంటనే ప్రవర్తన నియమావళి అమలులోకి వస్తుంది కాబట్టి ఎలక్షన్ ప్రశాంతంగా ముగిసేందుకు సిబ్బంది పనిచేయాలని సూచించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ మహేందర్ జీ, ట్రైని కలెక్టర్ శ్రద్ద శుక్ల, డీఆర్ డీఏ పీడీ శ్రీనివాస్ కుమార్, జిల్లా పరిషత్ సీఈఓ వెంకటేశ్వర్లు, రెవెన్యూ డివిజనల్ అధికారి రమేష్, నోడల్ అధికారులు, ఎన్నికల విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

## వరంగల్‌లో..

**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ఎన్నికల ప్రవర్తన, నియమావళిపై మాస్టర్ ట్రైనర్లు శ్రీనివాస్ సుధీర్ఘంగా వివరించారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో సోషల్ మీడియా, ఇ-పేపర్లు, కేబుల్ నెట్‌వర్క్‌తో సహా టీవీ, రేడియో ఛానెల్‌లు, మీడియా మానిటరింగ్ కమిటీ, అవగాహన కార్యక్రమాల ద్వారా సుదీర్ఘంగా వివరించారు. జిల్లా స్థాయి మీడియా సర్టిఫికేషన్ అండ్ మోనిటరింగ్ కమిటీ నిశిత పర్యవేక్షణపై సభ్యులకు అవగాహన కల్పించారు. అనంతరం ఎస్సీసీపీ, డీఎల్ఎంటి, ఎస్ ఎల్ ఎంటీలు, సభ్యులకు ఎన్నికల ప్రవర్తన నియామావళిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎన్నికల నోడల్ ఆఫీసర్ పశుసంవర్ధక శాఖ జేడి బాలకృష్ణ, మీడియా మానిటరింగ్ సెల్ నోడల్ అధికారి జిల్లా పౌర సంబంధాల అధికారి ఆయూబ్ అలీ, ఆర్డీఓ వాసు చంద్ర, ఎంసీఎంసీ సభ్యులు కృష్ణారెడ్డి, డిప్యూటీ కమిషనర్, రాజ్ కుమార్ ఈ డిస్టిక్ మేనేజర్, ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ శ్రీధర్, మెండు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డెక్కిన అన్నదాతలు

## గ్రీన్ ఫీల్డ్ హైవేకు భూములిచ్చేది లేదని నిరసన



**వరంగల్ వాయిస్, పరకాల :** గ్రీన్ ఫీల్డ్ హైవేకు మా భూములు ఇచ్చేది లేదని రోడ్డుపై అన్నదాతలు ధర్నాకు దిగారు. కోర్టులో కేసు ఉందనే విషయం తెలుపుతూ వినతి పత్రం పరకాల ఆర్డీఓకు అందజేశారు. పరకాల హైవే రోడ్డులో గ్రీన్ ఫీల్డ్ రైతులందరూ పెద్ద ఎత్తున ధర్నా చేయడం జరిగింది. భారీ ఎత్తున భూపాలపల్లి జిల్లా, ఉమ్మడి వరంగల్ జిల్లా తదితర జిల్లాల నుండి గ్రీన్ ఫీల్డ్ రైతులందరూ హాజరయ్యారు. ఎట్టి పరిస్థితిలో భూమి ఇచ్చేది లేదని, ప్రాణ త్యాగాలకైనా సిద్ధపడతాం కానీ, పచ్చని పంట పొలాల నుంచి గ్రీన్ ఫీల్డ్ రహదారిని వెళ్లనివ్వమన్నారు. జై జవాన్ జై కిసాన్ అంటూపెద్ద ఎత్తున రైతులు నినాదాలు చేశారు. ఇకనైనా ప్రభుత్వాలు ఆలోచించి మా భూముల నుంచి గ్రీన్ ఫీల్డ్ హైవే పోకుండా చూడాలని రైతులు కోరారు.

# కేసీఆర్ క్రీడా కిట్ల పంపిణీ



**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండల కేంద్రంలో అన్ని గ్రామాల సర్పంచ్ లకు కేసీఆర్ క్రీడా కిట్లను మంగళవారం వరంగల్ రూరల్ జడ్పీ చైర్ పర్సన్ గండ్ర జ్యోతి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోజు కనీసం ఒక గంట సేపైనా ఆటలు ఆడుతూ మానసిక ఉల్లాసం పొందాలని, ఆరోగ్యంగా ఉండాలని, ప్రతి ఊరిలో యువతకు ఆటల పైన అవగాహన కల్పిస్తూ ఆరోగ్య తెలంగాణగా మార్చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కృష్ణమూర్తి, మెతుకు తిరుపతి రెడ్డి , శాయంపేట మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు గంగుల మనోహర్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ అశోక్, సర్పంచ్ లు, అన్నీ గ్రామాల పంచాయితీ సెక్రటరీలు, ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ వినయ్ పాల్గొన్నారు.

# పాఠశాలకు ఎన్ఆర్ఐ చేయూత



**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఎదురవుతున్న నీటి సమస్యపై ఎన్ఆర్ఐ స్పందించారు. తెలంగాణ కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా హనుమకొండ జిల్లా కార్యదర్శి వంగర సాంబయ్య ఇదే పాఠశాలలో చదివిన పూర్వపు విద్యార్థి, ఎన్ ఆర్ఐ బాసని వెంకటేశ్వరులకు నీటీ సమస్యను వివరించగా ఆయన స్పందించి రూ. 30వేలతో బోరు మోటారు (సబ్ మెరిసిబుల్ మోటర్), పైపులు, వైరు కేబులు ఇతరత్రా అమర్చేందుకు ముందుకు వచ్చారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వరరావుకు పూర్తి సామాగ్రిని అప్పగించి సిబ్బందితో బిగించారు. స్పందించిన ఎన్నారైకి పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది శ్రీనివాస్, సదానందం, అజీరుద్దిన్, సత్య ప్రసాద్, ఉదయశ్రీ, రాజేష్, సావిత్రి, సామల నిరంజన్ పాల్గొన్నారు.

# మున్నూరు కాపు సంఘ భవన నిర్మాణానికి సహకారం అందిస్తా

## చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మున్నూరు కాపు సంఘ భవన నిర్మాణానికి అన్ని రకాలుగా సహాయం అందిస్తానని ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. మంగళవారం వరంగల్ జిల్లా మున్నూరు కాపు భవనంలో ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ పాల్గొని మాట్లాడుతూ మున్నూరు కాపు సంఘంతో, ఈ స్థలంతో, ఈ నిర్మాణంతో అవినాభవ సంబంధం ఉందన్నారు. ఒక సామాన్య కార్యకర్త స్థాయి నుంచి ఈ స్థాయికి వచ్చానని తెలిపారు. 40ఏళ్ల నుంచి ఈ స్థలంతో, కుల సంఘ నాయకులతో సంబంధం ఉందని తెలిపారు. మీ అందరి సహకారంతో, మీ అందరి దీవెనలతో శాసనసభ్యుడిగా ఎంపికయ్యానని అన్నారు. అంబేద్కర్ అన్నట్లు పే బ్యాక్ టు సొసైటీ అన్నట్లుగా సంఘం బలోపేతానికి కృషి చేయాలన్నారు. కొంతమంది ముఖ్యులు భవనం కోసం నా దగ్గరకు వస్తే నా పూర్తి సహకారాలు అందిస్తానని తెలిపి, ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి రూ.5.5 కోట్లను మంజూరు చేయించడం జరిగిందన్నారు. ఈ స్థలంలో రోడ్డు పోతుంది అన్నప్పుడు కూడా మాట్లాడి మాస్టర్ ప్లాన్ నుంచి తొలగించడం జరిగిందన్నారు. భవన నిర్మాణ అనుమతి కోసం అందరితో మాట్లాడి నిధులను తీసుకురావడం జరిగిందన్నారు. ఈ నెల 6న మంత్రి కేటీఆర్ వస్తున్నారని, అతనితోనే భవనిర్మాణ శంకుస్థాపన కార్యక్రమాన్ని కొబ్బరి కాయ కొట్టి ప్రారంభిస్తారని తెలిపారు. సంఘంలో ఉన్న వాళ్లకే ఈ కాంట్రాక్టు ఇస్తానని తెలిపారు. ఈ భవన నిర్మాణం అందరికీ ఉపయోగపడే విధంగా నిర్మించాలని సంఘ సభ్యులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘ రాష్ట్ర, జిల్లా నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

# ఆరు గ్యారెంటీలు వంద రోజుల్లో అమలు

## కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బుచ్చిరెడ్డి



**వరంగల్ వాయిస్, శాయంపేట :** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఇచ్చిన ఆరు గ్యారంటీ హామీలను వంద రోజుల్లో అమలు చేస్తుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి అన్నారు. శాయంపేట మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుపేదల కోసం ప్రవేశపెట్టే ఆరు గ్యారెంటీ కార్డును మండల నాయకులతో కలిసి విడుదల చేశారు. అనంతరం మండల కేంద్రంలో ఇంటింటికి తిరిగి కార్డును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బుచ్చిరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ గతంలో పేద ప్రజల కోసం ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసిందని అన్నారు. ఈ 6 గ్యారంటీలను అధికారంలోకి వచ్చిన 100రోజుల్లో అమలు చేసి తీరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధికార ప్రతినిధి చిందం రవి, వైనాల కుమారస్వామి, ఎండి వలి హైదర్, రవిపాల్, లడే రాజ్ కుమార్, కుక్కల బిక్షపతి, మారపల్లి రాజు, మారేపల్లి కటయ్య, సాదు నాగరాజు, మిట్టపల్లి సతీష్, వెంకటరాజురెడ్డి, పాల్గొన్నారు.

# ఇంటింటికి బీజేపీకి అనూహ్య స్పందన



**వరంగల్ వాయిస్, పరకాల :** నియోజకవర్గంలోని సంగెం మండలం, తీగరాజుపల్లి గ్రామంలో ఇంటింటి ప్రచారంలో భాగంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బీజేపీ నాయకులు, మాజీ శాసనసభ్యుడు మొలుగూరి భిక్షపతి, డా.పగడాల కాళీ ప్రసాద్ రావు (ఐఎంఏ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు) పాల్గొన్నారు. ఈ సందర్భంగా డా.పగడాల కాళీ ప్రసాద్ రావు మాట్లాడుతూ గత వారం రోజులుగా ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న నాకు ప్రజల నుంచి అనుహ్య స్పందన రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఎప్పుడెప్పుడు ఎన్నికలు వస్తాయా ఈ బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని చిత్తుచిత్తుగా ఓడించి భారతీయ జనతా పార్టీకి అధికారం ఇవ్వడానికి ప్రజలందరూ ఎంతో ఆత్రుతతో ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బుట్టి కుమారస్వామి, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి శేషాద్రి, మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ రహమతుల్లా, మండల ప్రధాన కార్యదర్శి కీసర వీరయ్య, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు రంగరాజు కృష్ణ, గొర్ల కాపరి సెల్ జిల్లా కన్వీనర్ జక్క చేరాలు యాదవ్, శక్తి కేంద్రం ఇంచార్జి రంగరాజు కిరణ్, యువ మోర్చా ప్రధాన కార్యదర్శులు నంద్యాల సతీష్, రంగరాజు ప్రభాకర్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రమౌళి, మండల యువమోర్చా ఉపాధ్యక్షుడు బానోతు వెంకట్, మండల ఉపాధ్యక్షుడు రంగరాజు రాజు, వాసం సురేష్, వరికల కోటి, సాయిలు, సత్యనారాయణరెడ్డి, బన్న రమేష్, దారా భాస్కర్, కందుల సతీష్, దొంగల కుమారస్వామి, రజిని కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఆశిష్ మిశ్రాను వెంటనే అరెస్ట్ చేయాలి

## రైతు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ధర్నా



**వరంగల్ వాయిస్, వరంగల్ :** కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి అజయ్ మిశ్రా కుమారుడు ఆశిష్ మిశ్రా గత సంవత్సరం, ఉత్తరప్రదేశ్ లోని లకింపూర్ కేరి లో కేంద్రంలోని మోడీ ప్రభుత్వం చేసిన రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని ప్రదర్శన చేస్తున్న రైతులపై దాడి చేసి హత్య చేశాడు. సంవత్సరం గడిచినా ఇంత వరకు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అతనిపై చర్య తీసుకోలేదని, ఆశీష్ మిశ్రాను వెంటనే అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం నిరసన కార్యక్రమాలు చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా జాతీయ కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా వరంగల్ హెడ్ పోస్ట్ ఆఫీస్ సెంటర్లో రైతు కార్మిక సంఘాల నాయకులు కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈసందర్భంగా వారు రైతు రుణ విమోచన చట్టం చేయాలని, పంటల మద్దతు ధర గ్యారెంటీ చట్టం చేయాలని, కార్మిక వ్యతిరేక చట్టాల ఉపసంహరించుకోవాలని, రాష్ట్ర ప్రభుత్వం రైతుల మొత్తం రుణమాఫీని ఏకకాలంలో చేయాలని, కనీస వేతనం నెలకు రూ.26000 ఇవ్వాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపివేయాలని, విద్యుత్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్లతో కూడిన నినాదాలు చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకులు వల్లెపు ఉపేందర్ రెడ్డి, జిల్లా బాధ్యులు ఈసంపల్లి బాబు, వీరగోని శంకరయ్య, రాచర్ల బాలరాజు, సోమిడి శ్రీనివాస్, ఎన్ రెడ్డి హంసారెడ్డి, భూక్య సమ్మయ్య కుసుంబ బాబురావు, ఓదెల రాజయ్య, బాబన్న, కార్మిక సంఘాల నాయకులు కాసు మాధవి, నర్రా ప్రతాప్, గన్నారపు రమేష్, ముక్కెర రామస్వామి, గంగుల దయాకర్, కందిక చెన్నకేశవులు, మాలోత్ సాగర్, దండు లక్ష్మణ్, సింగారపు బాబు, ఉప్పుల రవి, ఇనుముల కృష్ణలతో పాటు రైతు కార్మిక సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కేసీఆర్ పాలనలో పల్లెల్లో పట్టణాలకు ధీటుగా అభివృద్ధి

## ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి



**వరంగల్ వాయిస్, టేకుమట్ల :** భూపాలపల్లి నియోజకవర్గానికి చివరి గ్రామమైన ఎంపెడు అభివృద్ధిలో ప్రథమంగా ఉందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి అన్నారు. మంగళవారం ఎంపెడు గ్రామంలో రూ.20లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనం, గ్రామ పాఠ్య బండాగారాన్ని(గ్రంథాలయం) ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు. గ్రామంలో రూ.10 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. గ్రామంలో ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణ కావాలని, స్థానిక ప్రజలు కోరగా ఎమ్మెల్యే నిధుల నుంచి రూ.10లక్షలు మంజూరు చేశారు. అనంతరం వెల్లంపల్లి గ్రామంలో 20లక్షలతో నిర్మించిన నూతన ఆరోగ్య ఉప కేంద్రాన్ని ప్రారంభించారు. వెల్లంపల్లి గ్రామ ఎంపీటీసీ సంగి రవి ఎమ్మెల్యేపై అభిమానంతో రాసిన పాటలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి, జడ్పీటీసీ పులి తిరుపతి రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు సట్ల రవి, మండల ప్రధాన కార్యదర్శి అకునూరి తిరుపతి, ఆయా గ్రామాల సర్పంచ్ లు, ఎంపీసీలు, అధికారులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ పార్టీలో భారీగా చేరికలు



**వరంగల్ వాయిస్, దేవరుప్పుల :** మండలంలోని కోలుకోండ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ జిల్లా యువ నాయకుడు కోతి ప్రవీణ్ గౌడ్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఆధ్వర్యంలో కోలుకోండ గ్రామానికి చెందిన పలువురు గులాబీ తీర్థం పుచ్చుకున్నారు. టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు గూడురు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి కౌడగాని కుమారస్వామి, కార్యదర్శి చీకట్ల ఎల్లయ్య, కోశాధికారి కుమార స్వామి, దామెర శంకర్, రచ్చ శ్రవణ్ కుమార్, రచ్చ రామానుజం, సమాల చిన్న వెంకయ్య, చిన్న కుమార్, గనుపాక పరశరాములు, శ్రీనివాస్, ప్రశాంత్ లతో పాటు 30మంది రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి గ్రామీణ మంచినీటి సరఫరా శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి బీఆర్ఎస్ లోని మంత్రి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ చేసిన అభివృద్ధి, బీఆర్ఎస్ పార్టీ చేసిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారన్నారు. పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని గెలిపించడానికి శాయ శక్తులా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మల్లికార్జున్ గ్రామ సర్పంచ్ కుర్నాల రవి, ముత్యాల కృష్ణమూర్తి గ్రామ పార్టీ అధ్యక్షుడు గనుపాక ఎల్లేష్, మాజీ గ్రామ పార్టీ అధ్యక్షుడు యాకస్వామి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు మాచర్ల బాబు, ఇంద్ర స్వామి, సతీష్ పాము మోహన్, యమగాని నాగయ్య, యమగాని ఎల్లయ్య, వాసర్ల మల్లయ్య, గుండె కారు శ్రీనివాస్, కన్న రామ్మూర్తి, మాచర్ల వెంకటయ్య, గణపాక బాబు, చింత నరేష్, నంగునూరు పరుశరాములు, కన్నెబోయిన నరసయ్య, భాచంపల్లి రాజు, కోతి శ్రీనివాస్, కావడగాని ప్రభాకర్, వల్లపు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# దళితుల గుడిపై ఎందుకంత కక్ష

## హిందూ ఆలయాల జోలికొస్తే ఖబడ్దార్

## పరకాల మాజీ ఎమ్మెల్యే మొలుగూరి



**వరంగల్ వాయిస్, పరకాల :** దళితులే పూజలు నిర్వహిస్తున్న మహంకాళి అమ్మవారి గుడిపై పరకాల ఎమ్మెల్యేకు ఎందుకంత కక్షా అని మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి ఆగ్రహం వ్యక్తం చేశారు. పరకాల పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం దారిలో ఉన్న మహంకాళి గుడి పై కక్ష సాధింపుతో పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి గుడి స్థలాన్ని ఆక్రమించేందుకు సిద్ధపడ్డాడని మండిపడ్డారు. ప్రతి ఒక్కరూ అమ్మవారి ఆశీస్సులు తీసుకుంటూ ఉండగా పరకాల ఎమ్మెల్యే మాత్రం మహంకాళి అమ్మవారి ఆస్తులపై కన్నేసి గుడి ప్రాంతాన్ని అక్రమించేందుకు కుట్రలు పన్నుతున్నాడని విమర్శించారు. మహంకాళి అమ్మ వారి ఆలయ ప్రాంగణంలో దళితులు నిర్మించుకున్న డబ్బాలను నీ అధికార దాహంతో తొలగించడం నీ పతనానికి నాంది అని, చిన్నా, చితక వ్యాపారాలు చేసుకుంటూ కిరాయిలు దళిత ఆలయానికి ఇస్తే నిత్య పూజలకే వాళ్లు వాడుకోవడం నీకు నచ్చట్లేదని ప్రశ్నించారు. పరకాల మున్సిపల్ కమిషనర్, బీఆర్ఎస్ కండువా కప్పుకోకుండా బీఆర్ఎస్ కార్యకర్తగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పరకాలకు వచ్చి కోట్లు సంపాదించుకొని పరకాల ప్రాంత ప్రజలకు అన్యాయం చేస్తావా అని ప్రశ్నించారు. మహంకాళి అమ్మవారి గుడి జోలికి వస్తే ఖబర్దార్ చల్లా ధర్మారెడ్డి.. నీ పతనం ప్రారంభమైందని బీజేపీ, హిందూ దేవాలయ పరిరక్షణకు అంగా ఉందని, ఆ విషయాన్ని మర్చిపోవద్దని హెచ్చరించారు. చివరి మూడు నెలలైనా పరకాలలో సంతోషంగా తిరగమని, ఆ తర్వాత పరకాలకు వచ్చేది లేదని హెచ్చరించారు. రాబోయే ఎన్నికల్లో వచ్చేది బీజేపీ ప్రభుత్వమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కార్యవర్గ సభ్యులు కాచం గురు ప్రసాద్, కొత్తగూడెం ప్రభారి దేవుని మేఘనాథ్, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా బొనగాని యాదగిరి గౌడ్ జన్మదిన వేడుకలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొనగాని యాదగిరి గౌడ్ జన్మదిన వేడుకలు గౌడ సంఘాల జేఏసీ నాయకులు, బీసీ సంక్షేమ సంఘం నాయకులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా బొనగాని యాదగిరి గౌడ్ ను శాలువాలతో సన్మానించి, కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారగోని కుమారస్వామి గౌడ్, రాష్ట్ర కార్యదర్శి చింత రమేష్ గౌడ్, గౌడ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకుడు పులి మోహన్ గౌడ్, ఉమ్మడి వరంగల్ జిల్లాల గౌడ సంఘాల జేఏసీ కో కన్వీనర్ పులి శ్రీనివాస్ గౌడ్, తెలంగాణ గౌడ సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు నకరకంటి మోహన్ గౌడ్, గౌడ సంక్షేమ సంఘం అధ్యక్షులు జిల్లా జూలూరి రంజిత్ గౌడ్, జై గౌడ్ ఉద్యమ సంఘం జిల్లా అధ్యక్షులు మార్క రవి గౌడ్, గౌడ సంఘం సీనియర్ నాయకులు రడం కృష్ణమూర్తి గౌడ్, అల్లం వేణు గౌడ్, కాకతీయ యూనివర్సిటీ గౌడ సంఘం నాయకులు సొల్తీ కిరణ్ గౌడ్, ఆగపాటి రాజ్ కుమార్ గౌడ్, యువ న్యాయవాది కూనూరు రంజిత్ గౌడ్, కోలా కిట్టు గౌడ్, కంకటి సాగర్ గౌడ్, బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు బుట్టి శ్యామ్ యాదవ్, ప్రధాన కార్యదర్శి శివ, ప్రైవేట్ లెక్చరర్ సంఘం నాయకులు కురిమిల్ల శ్రీనివాస్ గౌడ్, కోటగిరి శ్రీనివాస్ గౌడ్, పొన్నం రాజశేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# అర్సనపెల్లి వెంకటేశ్వరరావుకు ఘన నివాళి



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** మండల కేంద్రంలో గల సొసైటీలో అర్సనపల్లి వెంకటేశ్వరరావు వర్ధంతి వేడుకలు సొసైటీ చైర్మన్ ముద్దసాని సత్యనారాయణ రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన విగ్రహానికి పూలమాల వేశారు. ప్రాథమిక వ్యవసాయ సంఘ చైర్మన్ మాట్లాడుతూ ఏవీఆర్ న్యాయవాద వృత్తిని కొనసాగిస్తూ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని 1957 సంవత్సరంలో స్థాపించాడని అన్నారు. అంతేకాకుండా ఆయన వివిధ గ్రామాల్లో పొదుపు సంఘాలను ప్రారంభించారు. ఆయన కృషి మరువలేనిదని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పత్తి నాయక్, స్థానిక సర్పంచ్ కుండే మల్లయ్య, మండల పార్టీ కన్వీనర్ వైస్ ఎంపీపీ కంది కృష్ణారెడ్డి, మండల కోఆప్షన్ మహమ్మద్ గఫర్, సొసైటీ డైరెక్టర్లు రాజు, మజ్జిగ రాంబాబు, మహేందర్ రెడ్డి, నరేందర్ సొసైటీ సిబ్బంది సీఈఓ రవి, అకౌంటెంట్ ప్రవీణ్, ఫీల్డ్ ఆఫీసర్లు రాఘవులు, రమేష్, కట్ రెడ్డి, అటెండర్లు రాజు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# రేపు పాకాల వాగుపై బ్రిడ్జి నిర్మాణ పనులకు శంకుస్థాపన



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** మండల కేంద్ర శివారులోని పాకాల వాగుపై బ్రిడ్జి కం చెక్ డ్యాం నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ. 18.70 కోట్ల నిధులు మంజూరయ్యాయని, రెండు మండలాల ప్రజల, రైతుల చిరకాల వాంఛ అయిన బ్రిడ్జి నిర్మాణ పనులను నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి బుధవారం ప్రారంభించబోతున్నారని భారత రాష్ట్ర సమితి మండల కన్వీనర్, వైస్ ఎంపీపీ కంది కృష్ణారెడ్డి మంగళవారం తెలిపారు. అనంతరం చెన్నారావుపేట రైతు వేదిక క్లస్టర్ పరిధిలోని గ్రామాల రైతులకు ప్రభుత్వం నుంచి విడుదలైన నష్టపరిహారం(ఇన్ పుట్ సబ్సిడీ)చెక్కులను ఎమ్మెల్యే చేతుల మీదుగా బుధవారం చెన్నారావుపేట పాత సొసైటీ ఆవరణలో ఏర్పాటు చేసిన సభలో పంపిణీ చేస్తారని, రైతులు పాల్గొనాలని ఆయన కోరారు. రేపు పనులను ప్రారంభించడానికి వస్తున్న ఎమ్మెల్యేకు మండల ప్రజలు ఘన స్వాగతం పలకాలని ఆయన పిలుపునిచ్చారు. మంగళవారం పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి కృష్ణారెడ్డి సభాస్థలిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రైతు బంధు సమితి మండల కన్వీనర్ బుర్రి తిరుపతి, జడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు ఎండీ.రఫీ, ఆర్ బీఎస్ జిల్లా డైరెక్టర్ తూటి శ్రీనివాస్, మాజీ ఎంపీపీ కేతిడి వీరారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు ముద్దసాని సత్యనారాయణ రెడ్డి, మురహరి రవి, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు బాల్నే వెంకన్న, సర్పంచ్ కుండె మల్లయ్య, ఎంపీటీసీ దారావతు శ్రీను, కొండవీటి ప్రదీప్, ఆంగోతు వీరాసింగ్ తదితరులు పాల్గొన్నారు.

# మండల స్థాయి క్రీడోత్సవాల్లో సిద్ధార్థ విద్యార్థుల ప్రతిభ



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** మండల స్థాయి క్రీడోత్సవాల్లో తమ పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చాటి బహుమతులు సాధించినట్లు సిద్ధార్థ విద్యాసంస్థల చైర్మన్ కంది గోపాల్ రెడ్డి మంగళవారం తెలిపారు. గత నెల 29 ,30 తేదీలలో సూరిపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన డివిజన్ స్థాయి మండల స్థాయి క్రీడోత్సవాల్లో కబడ్డీలో సీనియర్ విభాగంలో అండర్ 17 జూనియర్ విభాగంలో అండర్ 14లో ప్రథమ బహుమతి సాధించారన్నారు. నర్సంపేట నిర్వహించే డివిజన్ స్థాయిలో ఆడనున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులను ఘనంగా అందించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం అండెం కరుణాకర్ రెడ్డి, పీఈటీలు పొన్నం రమేష్ , ఆరే రాజు, అల్లం లేని రవికుమార్ , ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# హనుమాన్ నగర్ కాలనీ డెవలప్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఓదెలు సంపత్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** స్థానిక హనుమాన్ నగర్ కాలనీ డెవలప్ మెంట్ అసోసియేషన్ నూతన కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నకున్నారు. అధ్యక్షుడిగా ఓదెలు సంపత్ ఏకగ్రవంగా ఎన్నికయ్యారు. ఈ సదర్భంగా కాలనీ డెవలప్ మెంట్ కోసం కృషి చేస్తున్న సంపత్ ను కాలనీ వాసులు సన్మానించి , శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుండారపు మహేష్, అనిశెట్టి రజనీకాంత్, రంజిత్, కురిమిల్ల శివ, ఎలకంటి రాజు , తదితరులు పాల్గొన్నారు.

# తూర్పు టికెట్ బీసీలకే కేటాయించాలి

## బీజేపీ నేత డాక్టర్ వన్నాల వెంకటరమణ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ తూర్పు నియోజకవర్గం బీజేపీ టికెట్ బీసీ అభ్యర్థికే కేటాయించాలని బీజేపీ నేత డా.వన్నాల వెంకటరమణ కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ వరంగల్ తూర్పు నియోజకవర్గంలో బీసీలు విద్యా, వ్యాపార రంగంలో అభివృద్ధి చెంది, రాజకీయ పరంగా చైతన్యవంతులయ్యారని తెలిపారు. చట్టసభలలో వరంగల్ తూర్పు నుంచి బీసీలే నాయకత్వం వహించాలని, ప్రతిఒక్క బీసీ కోరుకుంటున్నారని అన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ అన్ని బీసీ కుల సంఘాలు తమ ఐక్యతను, బలాన్ని సభలు, సమావేశాల ద్వారా ప్రదర్శిస్తున్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రధాన పార్టీలన్నీ బీసీల ఓట్లతో గద్దెనెక్కుతున్నాయని, బీసీలను రాజకీయ బానిసత్వం నుంచి విముక్తి చేసి బీసీలకు రాజ్యాధికారం ఇచ్చే దిశగా ముందుండాలని కోరారు. అలాగే సామాజికంగా బలంగా, సంఖ్యాబలం ఉన్న బీసీ అభ్యర్థికి టికెట్ ఇవ్వాలని వెంకటరమణ డిమాండ్ చేశారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలో అధికంగా బీసీలదే పై చేయి అన్నారు. తూర్పు నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ బీసీ అభ్యర్థికే టికెట్ కేటాయించిందని, కాంగ్రెస్ బీసీ అభ్యర్థికే టికెట్ కేటాయిస్తుందని తెలిపారు. అలాగే స్థానికంగా రాజకీయ సమీకరణాలు పరిగణలోకి తీసుకుని బీజేపీ కూడా బీసీ అభ్యర్థికే టికెట్ కేటాయించాలని వెంకటరమణ కోరారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలో అధికంగా బీసీ జాబితాలో పద్మశాలీలు 70వేలకుపైగా ఉంటారన్నారు. అదేవిధంగా కాపులు, కుమ్మరి, కమ్మరి, పెరిక, గౌడ్స్ ఇలా అన్ని కులాలు కలిపితే 1.50లక్షల మంది ఉంటారని చెప్పారు. బీసీ అభ్యర్థికే టికెట్ కేటాయించాలని బీసీలంతా ఎదురుచూస్తున్నారని వెంకటరమణ స్పష్టం చేశారు.

# కులగణనను చేపట్టడంలో బీహార్ ఆదర్శం

## కేంద్ర ప్రభుత్వం తక్షణమే కులగణన చేపట్టాలి

## బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు టి. వెంకట్రాములు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** బీహార్ లో నితీష్ కుమార్ ప్రభుత్వం దేశంలోనే తొలిసారిగా కుల గణన చేపట్టి కులపరమైన జనాభా గణన ఫలితాలను ప్రకటించడం పట్ల బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు హర్షం ప్రకటించారు . ఆ సర్వే ప్రకారం బీహార్ జనాభా13.07 కోట్లకు పైగా ఉండగా 63 శాతం బీసీలు, 19 శాతం షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు 1.68 శాతంగా ఉండగా అగ్రకులాలు జనాభాలో15.52 శాతంగా ఉన్నట్లు ఆ నివేదిక వెల్లడించిందన్నారు. దానిని ఆదర్శంగా తీసుకుని తక్షణమే నరేంద్ర మోడీ ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన జనాభా లెక్కల సేకరణలో కుల గణన చేపట్టాలని వెంకట్రాములు డిమాండ్ చేశారు. దేశ జనాభాలో సగాభాగానికి పైగా ఉన్న బీసీలకు రాజకీయంగా, సాంఘికంగా, ఆర్థికంగా అన్ని రంగాల్లో సరైన న్యాయం జరగాలంటే దేశంలో కుల గణన జరగాల్సిందేనన్నారు. రాజకీయాలకు అతీతంగా బీసీలంతా సమైక్యంగా కుల గణన తోపాటు చట్టసభలలో 50 శాతం రిజర్వేషన్ సాధన కోసం పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

# మధ్యాహ్న భోజన కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మధ్యాహ్న భోజన కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి, కనీస వేతనం రూ.18000 నిర్ణయించి అమలు చేయాలని, పెండింగ్ బిల్లులు చెల్లించాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యురాలు కాసు మాధవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం హనుమకొండ డీఈఓ ఆఫీస్ ఎదుట ఆరో రోజుకు చేరిన సమ్మె శిబిరాన్ని సందర్శించి ఒంటి కాలుపై నిలుచొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత 18 నెలలుగా చాలీచాలని వేతనాలతో, ఉద్యోగ భద్రత, ఎలాంటి హక్కులు లేకుండా ఎదురు పెట్టుబడి పెట్టి పిల్లలకు కడుపునిండా భోజనం పెడుతున్న మధ్యాహ్న భోజన కార్మికులను ప్రభుత్వం పట్టించుకోకుండా వారిని రోడ్డుపై నెట్టివేయడం దుర్మార్గమని అన్నారు. వారి డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని ఆమె కోరారు. లేకుంటే ఈ సమ్మెను మరింత ఉధృతం చేస్తామని ఆమె ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి ఎన్.రజిత, పద్మ, శాంత, సంధ్య, లక్ష్మి, అరుంధతి, ప్రేమలత, అరుణ, సరోజ, హైమా, రజిత, సుల్తానా, శారద, రమ, శ్రీవాణి, సమత, పుష్పలీల, సంధ్య, స్వప్న, సరళ, తదితరులు పాల్గొన్నారు.

# రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఓడించాలి

## సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** గత తొమ్మిది రోజులుగా ఆశాలకు ఫిక్స్ వేతనం రూ.18 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా సమ్మె చేస్తున్న ఆశాలు సమ్మెలో భాగంగా మంగళవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రభుత్వ చీఫ్ విప్ వినయ్ భాస్కర్ ఇంటి ముందు ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఏకశిలా పార్కు నుంచి మెయిన్ రోడ్డు మీదుగా చీఫ్ విప్ ఇంటికి చేరుకున్న ఆశాలను పోలీసులు భారీ కేడ్ పెట్టి అడ్డుకున్నారు. పోలీసులు ఆపడంతో సీఐటీయూ ఆశాలకూ, పోలీసులకు మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో అక్కడే బైఠాయించిన ఆశా వర్కర్లు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ధర్నా చేస్తున్న సీఐటీయూ ఆశా వర్కర్లను పోలీసులు ప్రభుత్వ చీఫ్ విప్ వినయ్ భాస్కర్ కు వినతి పత్రం ఇచ్చేందుకు ఒప్పించి అనుమతించారు. సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని పశ్చిమ ఎమ్మెల్యే ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ కు వినతి పత్రాన్ని అందజేశారు. అలాగే హనుమకొండ ఏకశిలా పార్కు నుంచి కాళోజి విగ్రహం మీదుగా పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఇంటి ముందు ఆశాలు పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆశాల సమస్యలను పరిష్కరించని బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని రాబోయే ఎన్నికల్లో ఓడించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ ఆశాలకు పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్, జిల్లా ఉపాధ్యక్షులు బోట్ల చక్రపాణి మాట్లాడుతూ గత తొమ్మిది రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా 26 వేల మంది ఆశాలు సమ్మె చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి పట్టించుకోవడంలేదని విమర్శించారు. ఆశాల సమస్యలను పరిష్కరించకపోతే రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దింపుతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు పుల్ల అశోక్, ఆశ యూనియన్ నాయకులు యాకూబీ, సీహెచ్ శ్రీవాణి, శోభ, కల్పన, పుతిలి, పద్మ, రజిత, సంధ్య, సుమలత, సుభాషిని, సునీత, సూర్య కళ, రాణి, రమ, సుకన్య, నవమని లతో పాటు వందలాది మంది ఆశాలు పాల్గొన్నారు.

# మైనారిటీల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

## చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ముస్లిం మైనారిటీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ హాజరై కుట్టు మిషన్ ట్రైనింగ్ సెంటర్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఉన్న పార్టీలు మైనారిటీలను ఓట్ల కోసం మాత్రమే వాడుకున్నారని అన్నారు. భారతదేశాన్ని ఎక్కువ కాలం పాలించిన కాంగ్రెస్ పార్టీ ఏం చేసిందో అందరికీ తెలుసన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పడిన తర్వాత ముస్లిం సోదరులను రాజకీయంగా, ఆర్థికంగా అభివృద్ధి పరిచే విధంగా అనేక సంక్షేమ పథకాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో సబ్బండ వర్గాల సంక్షేమ కోసం పాటుపడుతున్న ఏకైక ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వమని అన్నారు. మిగతా పార్టీలు మత విద్వేషాలు, మతకల్లోలాలు చేస్తూ మళ్లీ ఓట్లు అడగడానికి వస్తున్నారని అన్నారు. అలాంటి పార్టీలకు ప్రజలు గట్టిగా బుద్ధి చెప్పాలని కోరారు.ఈ కార్యక్రమంలో మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఇంతేయాజ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆజీజ్ ఖాన్, స్థానిక కార్పొరేటర్లు, ముస్లిం మత నాయకులు, పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# చాకలి ఐలమ్మ విగ్రహం మాయం

## ఫాతిమా నగర్‌లో రజక సంఘం నాయకుల ధర్నా



**వరంగల్ వాయిస్, కాజీపేట :** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కాజీపేట పట్టణం, ఫాతిమా నగర్ చౌరస్తా వద్ద గత నెల 26న రజక సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహం దొంగతనానికి గురైంది. దొంగిలించిన విగ్రహాన్ని వెంటనే ప్రభుత్వం అధికారికంగా ప్రతిష్టించేలా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఫాతిమా నగర్ లో రజక సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ట్రాఫిక్ కు తీవ్ర అంతరాయం కలగడంతో విషయం తెలుసుకున్న పోలీసులు ధర్నా చేస్తున్న రజక సంఘం నాయకులను చెదరగొట్టే ప్రయత్నం చేయగా రజక సంఘం నాయకులకు, పోలీసులకు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. స్థానిక ఎమ్మెల్యే వినయ్ భాస్కర్, ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, చాకలి ఐలమ్మ విగ్రహం ప్రభుత్వమే అధికారికంగా ప్రతిష్టించే విధంగా హామీ ఇచ్చారనీ రజక సంఘం నాయకులు తెలిపారు. లేకుంటే ఎల్లుండి జరగబోయే కేటీఆర్ ప్రోగ్రాంను అడ్డుకుంటామని రజక సంఘం నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ నార్లగిరి రామలింగం, నార్లగిరి రమేష్, అంకయ్య, సమ్మయ్య, సదానందం, తిరుపతి, కుమారస్వామి, భాష, భాస్కర్, మణికుమార్, మల్లయ్య, కాజీపేట, మడికొండ, కడిపికొండ, హనుమకొండ, వరంగల్ రజక సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్సీడీపై వైద్యాధికారులకు శిక్షణ



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** ఐడీఓసీలోని కాన్ఫరెన్స్ హాల్ లో మంగళవారం వైద్యాధికారులకు, ఎన్సీడీ స్టాఫ్ నర్సులకు, హెల్త్ సూపర్వైజర్స్ కు జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఏ.అంబరీష్, ఎన్ సీడీ పై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా డబ్ల్యూహెచ్ఓ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ పీపీటీ ద్వారా అవగాహన కల్పించారు. మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లతో, మానసిక ఒత్తిడి తగిన శ్రమ లేకపోవడం వల్ల డయాబెటిస్, రక్తపోటు, క్యాన్సర్ వ్యాధులు రోజురోజుకు పెరుగుతున్నాయని క్యాన్సర్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. వ్యాధి నిర్ధారణ చికిత్సతో పాటు తదనంతర సేవలకు సరైన విధంగా వైద్యం అందించాలని కోరారు. పది, పదిహేను రోజుల్లో ఊరురా ఎన్సీడీ స్క్రీనింగ్ ప్రారంభించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీఓఎన్ సీడీ డాక్టర్ రాజ్ కుమార్, కేవీ రాజు హెల్త్ ఎడ్యుకేటర్, డీడీఎం రాజ్ కుమార్, డీఈఓ ఉమాకర్, సీనియర్ ట్రీట్ మెంట్ సూపర్ వైజర్ రమేష్, వైద్యాధికారులు ఎన్సీడీ సూపర్ వైజర్లు, ఎన్ సీడీ స్టాఫ్ నర్సులు పాల్గొన్నారు.

# మహిళా సాధికారతే బీఆర్ఎస్ ప్రభుత్వ లక్ష్యం

## ఎమ్మెల్యే అరూరి రమేష్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మహిళలు అన్ని రంగాలలో సాధికారత సాధించడంతో పాటు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని విధాల కృషి చేస్తోందని బీఆర్ఎస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. మంగళవారం అరేపల్లి వజ్ర గార్డెన్స్ లో గ్రేటర్ వరంగల్ 3వ డివిజన్ ఎస్ఎల్ఎఫ్ ల వార్షిక మహాసభకు ఎమ్మెల్యే అరూరి రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మహిళా సంక్షేమానికి ముఖ్యమంత్రి కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. మహిళా సాధికారత కోసం అనేక సంక్షేమ పథకాలను రూపొందించి అమలు చేస్తున్న గొప్ప నాయకుడు మన ముఖ్యమంత్రి అని కొనియాడారు. మహిళా సంఘాలు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వడ్డీలేని రుణలు, పావలా వడ్డీ రుణాలను సద్వినియోగం చెసుకొని ఆర్థికంగా బలపడాలని సూచించారు. బీఆర్ఎస్ పరిపాలనలోనే రాష్ట్రంలోని మహిళలు ఆత్మగౌరవంతో జీవిస్తున్నారని తెలిపారు. చాలా కాలంగా ఎదురుచూస్తున్న వీవోఏల గౌరవ వేతనాలను పెంచి మహిళల పట్ల తన అభిమానాన్ని కేసీఆర్ చాటుకున్నారని అన్నారు. సీఎం కేసీఆర్ రుణం తీర్చుకోలేనిదని, మహిళలు ఆత్మగౌరవంతో బతికే విధంగా చర్యలు తీసుకుంటున్న సీఎం కేసీఆర్ కి ప్రతీ ఒక్కరూ అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు బంధు అధ్యక్షురాలు లలితా యాదవ్, స్థానిక కార్పొరేటర్ శోభారాణి – అనిల్, ప్రజా ప్రతినిధులు, మహిళా ప్రజా ప్రతినిధులు, మహిళా సంఘాల నాయకులు, మహిళలు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి




**వరంగల్ వాయిస్, తొర్రూరు :** స్థానిక లయన్స్ క్లబ్ లో హౌస్ పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంద సంఘం ఆధ్వర్యంలో అధ్యక్షుడు మంచి కంటి వెంకన్న అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రేషపల్లి నవీన్, భవన నిర్మాణ కార్మిక సంఘం ఏఐటీయూసీ అనుబంధ జిల్లా కార్యదర్శి మంద శంకర్ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్నసమస్యలను పరిష్కరించాలని కోరారు. పెండింగ్ లో ఉన్న క్లెయిమ్స్, సహజ మరణం ప్రమాద మరణం, పెళ్లి కానుక, శాశ్వతంగా అంగవైకల్యం, ప్రసూతి సహాయం, లేబర్ కార్డ్స్ తక్షణమే విడుదల చేయాలన్నారు. సహజ మరణం పొందిన కార్మికుడికి ఐదు లక్షలు పెంచి ఇవ్వాలని, ప్రమాదంలో మరణించిన కార్మికుడికి 10 లక్షలు, పెళ్లి కానుక కళ్యాణ లక్ష్మి మాదిరిగా రూ. 1,00,116, ప్రసూతి సహాయం రూ.50 వేల పెంచి ఇవ్వాలని, 55ఏళ్లు నిండిన ప్రతి కార్మికుడికి రూ. 5000 పెన్షన్ ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో పెయింటింగ్ యూనియన్ కార్యదర్శి చిలకమర్రి జగన్, ఎడ్ల ధర్మయ్య, సీనియర్ సలహాదారులు మంగళపల్లి వెంకట కృష్ణయ్య, ఇడుముల పుల్లయ్య, యాకన్న, బైరి శ్రీను, జంగల్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

# చిట్ ఫండ్ ఆఫీస్‌కు తాళం

## చిట్టి డబ్బులు ఇవ్వాలంటూ బాధితుల నిరసన



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** పట్టణ కేంద్రంలోని కమల జ్యోతి చిట్ ఫండ్ ఆఫీస్ కు మంగళవారం బాధితులు సర్వి రమేష్ తాళం వేశారు. చిట్ పూర్తై రెండు సంవత్సరాలు గడుస్తున్నా డబ్బులు చెల్లించకపోవడంతో ఆఫీస్ చుట్టూ తిరిగి విసిగిపోయిన చిట్టీ దారులు తమకు రావలసిన డబ్బులకోసం గురువారం చిట్ ఫండ్ ఆఫీస్ కు వచ్చారు. తమకు డబ్బులు వెంటనే చెల్లించాలంటూ ఉద్యోగులను నిలదీశారు. చిట్ ఫండ్ కంపెనీ డబ్బులు చెల్లించకపోవడంతో చిట్ ఫండ్ ఆఫీస్ కు తాళంవేసి నిరసన తెలిపారు.

# 6న ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్ ప్రారంభం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** జిల్లా ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్ ను ఆధునిక వసతులతో రూ. 7.5 కోట్ల నిధులతో నిర్మించినట్లు ప్రభుత్వ చీఫ్ విప్, వరంగల్ పశ్చిమ శాసనసభ్యుడు వినయ్ భాస్కర్ తెలిపారు. జిల్లా ఆర్ అండ్ బీ ఉన్నతాధికారులతో మంగళవారం సాయంత్రం పరిశీలించారు. ఈనెల 6న కేటీఆర్ పర్యటన నేపథ్యంలో ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ ను ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. జీ ప్లస్ త్రీ అంతస్తులతో ఆధునిక వసతులతో నిర్మించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ ఇంటింటి ప్రచారం



**వరంగల్ వాయిస్, కాజీపేట :** నగరంలోని కాజీపేట 62వ డివిజన్ లో కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియా గాంధీ ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీల అభయ హస్తం కార్డుల ఇంటింటికీ కార్యక్రమాన్ని మంగళవారం హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు నాయిని రాజేందర్ రెడ్డి ప్రారంభించారు. రహమత్ నగర్ లోని స్థానిక చర్చ్ లో ప్రత్యేక ప్రార్థనలు చేసి ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో బీఆర్ఎస్, దేశంలో బీజేపీ ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నాయని అన్నారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో నేటి వరకు ఒక్క డబుల్ బెడ్ రూమ్ కూడా ఇవ్వలేదని, కాజీపేట బస్టాండ్ నిర్మాణం నేటి వరకు నెరవేర్చలేదని, రైల్వే పరిశ్రమలను అటకెక్కించారని, పురవీధులలో ఉన్న రోడ్లను కూడా మరమ్మత్తులు చేయలేదని, ఇచ్చిన మాట నిలబెట్టుకోలేదని, సుమారు పదేండ్ల పరిపాలనలో యువకులను తాగుబోతుల తెలంగాణలా మార్చారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియా గాంధీ ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణ రాష్ట్ర ఇచ్చి నిలబెట్టుకున్నారని, అదేవిధంగా రానున్న రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసిన 100 రోజుల్లో ఈ 6 గ్యారంటీలు నెరవేరుస్తామని ఇంటింటికి గ్యారెంటీ కార్డులను పంపిణీ చేస్తూ ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో 62వ డివిజన్ అధ్యక్షుడు పాలడుగుల ఆంజనేయులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు ఎం.వి సమత రాజు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జిల్లా అధికార ప్రతినిధి మహమ్మద్ అంకూస్, పాక భాస్కర్, డాక్టర్ శ్రవణ్, జంగా సులోచన, సర్తాజ్, పిల్లి కమలాకర్ (చంటి) పిల్లి కరుణాకర్, గడిపే బాబు, మహమ్మద్ రఫీ, మురారి రమేష్, నాగపురి లలిత, బుర్ర బాబురావు, కే ప్రవీణ్, కే సంపత్, కె నాగు, జైపాల్, శ్రీను, రాజేష్, రంగు సుధీర్, జక్కుల నవీన్ యాదవ్, లలిత, పర్వీన్, పర్వీన్, వరలక్ష్మి, లిల్లీ , భాగ్యలక్ష్మి, కరీమా, కృప, స్థానిక 62వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు స్థానిక మహిళలు, యువకులు, పెద్ద మనుషులు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండలంలోని పలు గ్రామాలలో సీఎం సహాయ నిధి పథకం కింద మంజూరైన లబ్ధిదారులకు మంగళవారం వరంగల్ జడ్పీ చైర్ పర్సన్ గండ్ర జ్యోతి చెక్కులను పంపిణీ చేశారు. మాందారిపేట గ్రామానికి చెందిన సాంబరి వినోద్ కుమార్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా రూ.రెండు లక్షల బీఆర్ఎస్ పార్టీ ఇన్సూరెన్స్ చెక్కును గండ్ర జ్యోతి వారి స్వగృహానికి వెళ్లి కుటుంబ సభ్యులకు అందజేశారు. అనంతరం శాయంపేటకు చెందిన దాసరి ఉమేష్ రూ. 42500, కొప్పుల వాస్తవ్యులు కొలిపాక గణేష్ లకు రూ. 16,000 విలువ గల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు గంగుల మనోహర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రం అశోక్, మాజీ వైస్ ఎంపీపీ వంగల నారాయణరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కుసుమ శరత్, దుంపల మహేందర్ రెడ్డి, ఉపసర్పంచ్ సుమన్, నాయకులు గాజే రాజేందర్, పొడి శెట్టి గణేష్, బత్తుల కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

# రేగులగూడెంలో వైద్య శిబిరం



**వరంగల్ వాయిస్, కాటారం :** సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రజలను అప్రమత్తం చేస్తూ మంగళవారం మండలంలోని రేగులగూడెంలో ఉచిత వైద్య ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. కాటారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంఎల్ హెచ్ పీ డాక్టర్ వందన, ఏఎన్ఎం రజినీలు పాల్గొని రోగులను పరీక్షించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. గర్భిణీ స్త్రీలు ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పు చేసుకోవాలని వివరించారు. బీపీ, షుగర్ తదితర వ్యాధులకు మందులు పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా కాచిన నీటిని వడబోసి తాగాలని సూచించారు. పూల కుండీలలో, టైర్లలో, కొబ్బరి బోండాలలో, ఎయిర్ కూలర్ లలో, పాత సామాన్లలో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వారు సూచించారు.

# సీజనల్ వ్యాధుల నుంచి అప్రమత్తంగా ఉండాలి



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** వర్షాకాలంలో సంభవించే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ మధుసూదన్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని సిద్ధార్థ గురుకుల పాఠశాల, సోషల్ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాలను సందర్శించి పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల అవరణలో నీరు నిలువకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పాఠశాల చుట్టూ ఎప్పటికప్పుడు దోమల మందు పిచికారి చేయించాలని, నీరు నిల్వ ఉన్న ప్రాంతాలలో ఆయిల్ బాల్స్ వేయాలన్నారు. దోమల నివాసాలు లేకుండా టైర్లు, చెత్త కుండీలు, వాడకంలో లేని ప్రతి వస్తువును వెంటనే బయటకు తరలించాలని సూచించారు. విద్యార్థులకు ఎప్పటికప్పుడు ఆరోగ్య జాగ్రతలు చెప్పాలని, తాగు నీటి ప్లాంట్ ని ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి నంద, హెల్త్ సూపర్ వైజర్ రామెల్, సిబ్బంది శివాజీ, సారియా, సురేందర్, పుష్ప, పాఠశాల హెచ్ఎం కర్ణాకర్ రెడ్డి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# అదరగొట్టనున్న యాక్షన్ సన్నివేశాలు



జనతా గారేజ్ తర్వాత కొరటాల శివ -జూనియర్ ఎన్టీఆర్ కలయికలో వస్తున్న చిత్రం కావడంతో అంచనాలు భారీగా ఉన్నాయి. భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతోన్న ఈ సినిమాతో బాలీవుడ్ భామ జాన్వీకపూర్ టాలీవుడ్ ఎంట్రీ ఇస్తోంది. దేవరలో బాలీవుడ్ స్టార్ యాక్టర్ సైఫ్ అలీఖాన్ భైర పాత్రలో (విలన్‌గా) నటిస్తున్నాడు. హైదరాబాద్ సమీపంలో వేసిన స్పెషల్ సెట్‌లో తారక్‌పై వచ్చే సోలో సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారని ఇప్పటికే ఓ అప్‌డేట్ బయటకు వచ్చింది. వీఎఫ్ఎక్స్ పనుల కారణంగా సినిమా ఆలస్యం కాకుండా.. క్లైమాక్స్ పోర్షన్‌ను కొరటాల టీం ముందుగానే షూట్ చేస్తుందని నెట్టింట వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి. ఎన్టీఆర్‌పై వచ్చే అండర్‌వాటర్ సీక్వెన్స్‌ను ఈ సెట్‌లో చిత్రీకరిస్తున్నట్టు వార్తలు వచ్చాయి. తాజాగా సినిమాటోగ్రాఫర్ రత్నవేలు దేవరకు సంబంధించిన కొత్త అప్‌డేట్‌ను అందించి.. మూవీ లవర్స్‌లో జోష్ నింపుతున్నాడు. రాత్రి సమయంలో సముద్రంలో వచ్చే భారీ యాక్షన్ సీన్ల షూటింగ్ చేసినట్టు.. లొకేషన్‌లో తీసిన స్టిల్‌ను షేర్ చేశాడు రత్నవేలు . ఈ అప్‌డేట్‌తో అభిమానులు ఫుల్ ఖుషీ అవుతున్నారు. దేవరలో చాలా కీలకంగా సాగే ఈ సీక్వెన్స్ కోసం తారక్ ప్రత్యేకంగా శిక్షణ కూడా తీసుకున్నాడట. దేవరలో పాపులర్ మలయాళ నటుడు షైన్ టామ్ చాకో కీలక పాత్రలో నటిస్తున్నాడు. మల్టీ లింగ్యువల్ ప్రాజెక్ట్‌గా వస్తున్న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా 2024 ఏప్రిల్ 5న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ మూవీని ఎన్టీఆర్ ఆర్ట్స్, యువసుధ ఆర్ట్స్ బ్యానర్లపై సుధాకర్ మిక్కిలినేని, కొసరాజు హరికృష్ణ సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు.



# సైలెంట్‌గా దూసుకొచ్చింది

ఇప్పుడు టాలీవుడ్ లో బిజీ హీరోయిన్ ఎవరంటే శ్రీలీల పేరే చెప్తారు. దాదాపు ఎనిమిది సినిమాలు ఆమె చేతిలో వున్నాయి. ఇప్పుడు ఈ రేసులోకి మరో హీరోయిన్.. మీనాక్షి చౌదరి కూడా దూసుకొస్తున్నారు. హిట్ 2, ఖిలాడీ చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన మీనాక్షి.. ఇప్పుడు టాప్ లోకి వెళ్లడానికి రెడీగా వుంది. మీనాక్షి చౌదరి చేతిలో ఇప్పుడు పెద్ద, మీడియం కలుపుకొని దాదాపు అరడజను చిత్రాలు వున్నాయి. మహేష్ బాబు గుంటూరు కారంలో హీరోయిన్ గా నటిస్తోంది మీనాక్షి. అలాగే విశ్వక్ సేన్ తో మెకానిక్ రాకీ సినిమా చేస్తోంది. ఇటీవలే ప్రారంభమైన దుల్కర్ సల్మాన్ పాన్-ఇండియన్ చిత్రం లక్కీ భాస్కర్‌లో కూడా ఆమెనే హీరోయిన్. వరుణ్ తేజ్ చేయబోతున్న పాన్ ఇండియా ఎంటర్ టైనర్ 'మట్కా' లో కథానాయికగా మీనాక్షిని తీసుకున్నారు. ఇలా క్రేజీ ఆఫర్స్ తో దూసుకుపోతున్న మీనాక్షికి ఇప్పుడు మరో బిగ్ ఆఫర్ వచ్చింది. విజయ్, వెంకట్ ప్రభు కాంబినేషన్ లో ఓ సినిమా రాబోతుంది. ఇందులో ఓ హీరోయిన్ గా మీనాక్షిని తీసుకున్నారు. ఇవి కాకుండా ఆమె చేతిలో కొన్ని బాలీవుడ్ ప్రాజెక్ట్స్ కూడా వున్నాయి. మొత్తానికి వరుస సినిమాలతో శ్రీలీల తర్వాత మరో బిజీ హీరోయిన్ గా మారింది మీనాక్షి.






# టైగర్ 3 ఎప్పుడంటే..



బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్ టైగర్ ఫ్రాంఛైజీలో నటించిన సినిమాలు బాక్సాఫీస్ వద్ద ట్రెండ్ సెట్ చేశాయని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ఇదే జోనర్‌లో వస్తున్న తాజా చిత్రం టైగర్ 3. మనీశ్ శర్మ దర్శకత్వం వహిస్తుండగా.. బాలీవుడ్ భామ కత్రినాకైఫ్ హీరోయిన్‌గా నటిస్తోంది. షారుఖ్ ఖాన్ కీలక పాత్రలో నటిస్తున్నాడు. ఈ చిత్రాన్ని దీపావళి కానుకగా విడుదల చేస్తున్నట్టు ఇప్పటివరకున్న అప్‌డేట్. అయితే మేకర్స్ విడుదల తేదీ ఎప్పుడనేది మాత్రం సస్పెన్స్‌లో పెడుతూ వస్తున్నారు

ఈ చిత్రంలో ఇమ్రాన్ హష్మీ విలన్‌గా నటిస్తుండగా.. అశుతోష్ రాణా, అనుప్రియా గోయెంకా, రిద్ధి డోగ్రా, అంగద్ బేడి కీలక పాత్రలు పోషిస్తున్నారు. అలనాటి అందాల తార రేవతి చాలా కాలం తర్వాత మరోసారి స్టార్ హీరో సల్మాన్ ఖాన్‌తో కలిసి సిల్వర్ స్క్రీన్ షేర్ చేసుకోబోతుంది. టైగర్ ఫ్రాంఛైజీలో ఏక్తా టైగర్, టైగర్ జిందా హై తర్వాత వస్తున్న సినిమా కావడంతో టైగర్ 3పై అంచనాలు భారీగా ఉన్నాయి.

# పారిస్‌లో మెరిసిన ఐశ్వర్యరాయ్



బాలీవుడ్ స్టార్ హీరోయిన్, మాజీ ప్రపంచ సుందరి ఐశ్వర్యరాయ్ బచ్చన్ ఫ్యాషన్ లుక్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఏ సినీ వేడుకలోనైనా, ఫ్యాషన్ షోలోనైనా ఐష్ విభిన్న కాస్ట్యూమ్స్‌తో అలరిస్తుంటుంది. ఇక కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్, పారిస్ ఫ్యాషన్ వీక్ వంటి ప్రపంచ వేదికగా జరిగే ఫ్యాషన్ షోలకు కొత్త కళను తెస్తుంటుంది ఈ నీలి కళ్ల సుందరి. ఆయా వేడుకల్లో రెడ్ కార్పెట్‌పై అలా నడుచుకుంటూ వస్తుంటే కెమెరా కళ్లన్నీ ఐష్ ఉంటాయి. తాజాగా ఐశ్వర్య పారిస్ ఫ్యాషన్ వీక్ లో సందడి చేసింది. ర్యాంప్‌పై క్యాట్‌వాక్‌తో హ్పాయలు పోయింది. ట్రెండీ లుక్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రేక్షకులకు కన్ను కొడుతూ, ఫ్లైయింగ్ కిస్‌తో ఆకట్టుకుంది. ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి.

# 'అయలాన్' టీజర్‌కు ముహూర్తం ఫిక్స్

ఈ ఏడాది మహావీరుడు సినిమాతో మంచి విజయం అందుకున్నాడు కోలీవుడ్ స్టార్ హీరో శివకార్తికేయన్. ఇక శివకార్తికేయన్ తాజాగా నటిస్తున్న చిత్రం 'అయలాన్'. (తమిళంలో 'అయలాన్' అంటే 'ఏలియన్' అని అర్థం) ఈ సినిమాలో రకుల్ ప్రీత్‌సింగ్ కథనాయికగా నటిస్తుంది. ఆర్.రవికుమార్ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా.. ఆస్కార్ అవార్డు గ్రహీత ఏ.ఆర్.రెహమాన్ ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నాడు. ఇప్పటికే మూవీ నుంచి మేకర్స్ లాంఛ్ చేసిన అయలాన్ ఫస్ట్ లుక్ పోస్టర్ నెట్టింట హల్ చల్ చేస్తోంది. శివకార్తికేయన్ గగనంలో విహరిస్తుండగా.. అతడితోపాటే ఏలియన్ కూడా వెళ్తున్న లుక్ సినిమాపై క్యూరియాసిటీ పెంచుతోంది. ఇదిలా ఉంటే ఈ సినిమా నుంచి మేకర్స్ సాలిడ్ అప్‌డేట్ ఇచ్చారు. ఈ మూవీ టీజర్‌కు మేకర్స్ ముహూర్తం ఫిక్స్ చేశారు. అయలాన్ టీజర్‌ను అక్టోబర్ 06న విడుదల చేయనున్నట్లు చిత్రబృందం తెలిపింది. దీనితో పాటు ఒక ఫొటో కూడా వదిలింది. ఈ ఫొటోలో ఏ.ఆర్.రెహమాన్‌తో పాటు శివకార్తికేయన్, రవికుమార్, గ్రహాంతర వాసి టీజర్ కోసం చూస్తున్నట్లు ఉంది. ప్రస్తుతం ఈ ఫొటో సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతుంది.



# 108 బంగారు పద్మాలతో పూజలు



**వరంగల్ వాయిస్, చిలుపూరు :** జనగామ జిల్లా చిలూపూరు గుట్ట శ్రీ బుగులు వెంకటేశ్వర స్వామికి మంగళవారం 108 బంగారు పద్మాలతో అష్టాదళ పాద పద్మారాధన చేశారు. హైదరాబాద్ భక్తులు పోతరాజు సురేష్-లక్ష్మి, వెలదండి అశోక్-శిరీష, ఎడ్ల ఆనంద్ రావు-మంజుల, పోతరాజు అక్షిత-విష్ణు దంపతులు రూ.516 చెల్లించి సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతి మంగళవారం నిర్వహించే ఈ పూజా కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆలయ అధికారులు కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో బి.లక్ష్మీ ప్రసన్న, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు, ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు సౌమిత్రి రంగాచార్యులు, బ్రాహ్మణపల్లి రవీందర్ శర్మ, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

# కేటీఆర్ పర్యటనకు భారీ బందోబస్తు

## పోలీస్ ఉన్నతాధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో సీపీ పరిశీలన



**వరంగల్ వాయిస్, క్రైం :** రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ ఈనెల 6న నగరంలో పర్యటించనున్న సందర్భంగా భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ఈ మేరకు పోలీస్ ఉన్నతాధికారులతో కలిసి వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ.రంగనాథ్ మంగళవారం క్షేత్ర స్థాయిలో బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. కాకతీయ వైద్య కళాశాలలో ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్ నిర్మాణంతో పాటు భద్రత పరంగా తీసుకోవాల్సిన చర్యలపై పోలీస్ అధికారులతో సీపీ చర్చించారు. అనంతరం రంగంపేటలో నూతనంగా ఏర్పాటు చేసిన పోలీస్ భరోసా కేంద్రం భవనంతో పాటు, లబ్ధిదారులతో చింతల్ లో నిర్వహించనున్న బహిరంగ ప్రదేశాన్ని సీపీ పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి సందర్శించే సమయంలో అధికారులు క్షేత్ర స్థాయిలో చేపట్టాల్సిన భద్రత ఏర్పాట్లతో పాటు, అధికారులు నిర్వర్తించాల్సిన విధులపై పలుసూచనలు చేశారు. ముఖ్యంగా సభా ప్రాంగణం వద్ద చేపట్టాల్సి బందో బస్తు, వాహన పార్కింగ్, మంత్రి సభాస్థలికి చేరుకునేందు ప్రయాణించే మార్గాల్లో పోలీస్ బందోబస్తు, అలాగే సభా స్థలికి ప్రజలు రావాల్సిన దారులపై పోలీస్ అధికారులతో చర్చించారు. బహిరంగ సభ నిర్వహించే సభాస్థలి మ్యాప్ ను ఆయన పరిశీలించారు. సమీక్షలో క్రైమ్స్ డీసీపీ దాసరి మురళీధర్, సెంట్రల్ జోన్ డీసీపీ అబ్దుల్ బారి, అదనపు డీసీపీలు సంజీవ్, సురేష్ కుమార్, వరంగల్, ట్రాఫిక్, క్రైమ్స్ ఏసీపీలు బోనాల కిషన్, భోజరాజు, మల్లయ్య, ఇన్స్పెక్టర్లు వెంకటేశ్వర్లు, సువర్ణ, సంజీవ్, వెంకన్న, శ్రీనివాస్ ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.




# కళ్లకు గంతలు కట్టుకొని నిరసన

## 14వ రోజుకు చేరిన మధ్యాహ్న భోజనం కార్మికుల సమ్మె

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మధ్యాహ్న భోజన కార్మికులు మంగళవారం 14వ రోజు కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. కార్మికుల సమ్మెకు ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాషబోయిన సంతోష్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్షుడు ధర్ముల రామ్మూర్తి అధ్యక్షతన ఏకశిలా పార్క్ ఎదుట వంట కార్మికులనుద్దేశించి సంతోష్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా సంస్థల్లో పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు కృషి చేస్తున్న వంట కార్మికులకు గౌరవ వేతనం రూ.3వేలు ఇస్తానంటూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించి అమలు చేయకపోవడం శోచనీయమన్నారు. ప్రాథమిక విద్యార్థికి రూ.5.40. హైస్కూల్ విద్యార్థికి రూ.8 మాత్రమే ప్రభుత్వం చెల్లించడంతో మధ్యాహ్న భోజనం కార్మికులు అప్పుల పాలు కావాల్సి వస్తోందన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ప్రతి విద్యార్థికి రూ.25 చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గడ్డం లలిత, విజయ, మస్తాన్, బి.కమల, బొంకూర్ ఐలయ్య, కవిత, పద్మతోపాటు వందలాది మంది కార్మికులు ధర్నాలో పాల్గొన్నారు.

# షటిల్‌లో అక్షయ్ కుమార్‌కు ప్రథమ బహుమతి

**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** బ్యాడ్మింటన్ అండర్ 11 బాలుర విభాగంలో సిరిపురం అక్షయ్ కుమార్ రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతి పొందారు. హైదరాబాద్ నాచారంలోని ఎంకేఎస్ అకాడమీ ఆధ్వర్యంలో ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో నిర్వహించిన షటిల్ పోటీల్లో అక్షయ్ డబుల్స్ లో విజేతగా నిలిచారు. 2014 మే 1న వరంగల్ జిల్లా ఆత్మకూరు మండల కేంద్రంలో సిరిపురం దివ్య-శ్యామ్ దంపతుల కుమారుడు అక్షయ్ కుమార్. సెయింట్ థెరీసా పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న విద్యార్థి ప్రముఖ బ్యాడ్మింటన్ కోచ్ కూరపాటి రమేష్ వద్ద శిక్షణ పొందుతున్నారు. 2022లో రన్నర్ గా, 2023లో డిస్ట్రిక్ట్ విన్నర్ గా నిలిచారు. 2023 సెప్టెంబర్ 29 నుంచి అక్టోబర్ 1 వరకు హైదరాబాదులో జరిగిన షటిల్ టోర్నమెంట్ లో రాష్ట్ర స్థాయిలో అక్షయ్ కుమార్ విజేతగా నిలిచారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎన్నారై బైరి జగన్ రూ.10వేల నగదు పురస్కారం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీబీఏ అధ్యక్షుడు బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోశాధికారి గడ్డం కేశవమూర్తి, షటిల్ క్రీడాకారులు అరుణ్, ప్రభాకర్ రావు, రాజు, విజయ్, విక్రం రెడ్డి, సంపత్, పూజారి విజయ్, రఘు, దేవేందర్ రెడ్డి, కోచ్ కూరపాటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ ఉపాధ్యాయురాలికి సన్మానం



**వరంగల్ వాయిస్, జనగామ :** ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు స్వీకరించిన వనబోజు స్రవంతిని లయన్స్ క్లబ్ ఆబాద్ జనగామ ఆధ్వర్యంలో మంగళవారం వెంకిర్యాల ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఎస్ఎంసి సభ్యులు ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథిగా హాజరైన సర్పంచ్ కీర్తి లక్ష్మీ నర్సయ్య మాట్లాడుతూ అంకితభావంతో విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు సమాజంలో గుర్తింపు ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ బృందం లలిత, విద్యారాణి, జగదాంబ, స్వరూప, పంచాయతీ సెక్రెటరీ దివ్యా రెడ్డి, కారోబార్ రామగుండం రామ నర్సయ్య, ఆయాలు ఎలేంద్ర, లక్ష్మి పాల్గొన్నారు.

# జిల్లా స్థాయి ఖోఖో జట్ల ఎంపిక



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** ఈ నెల 7, 8 తేదీల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్న కోకో ఆట పోటీల సెలక్షన్స్ మంగళవారం శంభునిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగాయి. స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ ఇండియా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సెలెక్షన్స్ కు ముఖ్యఅతిథిగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్ బాబు హాజరయ్యారు. జిల్లా స్థాయి కోకో పోటీల్లో తలపడడానికి సిద్ధమవుతున్న తరుణంలో వారందరికీ ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ జీఎఫ్ ఐ సెక్రెటరీ బొబ్బిలి వెంకన్న, ఉమ్మడి వరంగల్ జిల్లా బాల్ బ్యాట్మెంటన్ ప్రధాన కార్యదర్శి కొడారి రవి, నాయకులు కనుకుంట్ల రంజిత్, అరకుల రవి తదితరులు పాల్గొన్నారు.

# వర్గ వ్యవస్థలో భాగమే కుల వ్యవస్థ : అశోక్ ఓంకార్



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వర్గ సామాజిక జమిలి పోరాటాలను ఉధృతం చేయడమే అమరులకు ఇచ్చే ఘన నివాళి అని ఎంసీపీఐ(యూ) జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ మద్దికాయల అశోక్ ఓంకార్ అన్నారు. మంగళవారం అమరజీవులు కామ్రేడ్ పరికరాల భూమయ్య, పిట్ట వెంకటయ్య, సింగిరెడ్డి కొంరయ్య సంస్మరణ సభ వరంగల్ జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ అధ్యక్షతన స్థానిక ఓంకార్ భవన్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వల్లేపు ఉపేందర్ రెడ్డి, వనం సుధాకర్, కుంభం సుకన్య, గోనె కుమారస్వామి, ఏన్ రెడ్డి హంస రెడ్డి, తుకారాం నాయక్, మంద రవి, గడ్డం నాగార్జున, నర్ర ప్రతాప్, జబ్బార్, నాయక్, కర్రోల్ల శ్రీనివాస్, వంగల రాగసుధ, నీల రవీందర్, మాస్ సావిత్రి, కర్ర రాజిరెడ్డి, కుసుంబ బాపూరావు, గుండెబోయిన చంద్రయ్య, నాగెల్లి కొమరయ్య, గాదె మల్లేష్, కంచ వెంకన్న, అంగడి పుష్ప, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సోమిడి శ్రీనివాస్, సుంచు జగదీశ్వర్, యండి ఇస్మాయిల్, కందికొండ కుమారస్వామి, గుగులోత్ అరుణ్ నాయక్, హుస్సేన్, బుచ్చయ్య, తిరుపతి, నాగేష్ పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com